# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ళను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **మత్తుపదార్థాల వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని హోంమంత్రి వి. అనిత వెల్లడించారు.**

3. **ఉద్యోగాలకు తగిన నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకునేలా విద్యావ్యవస్థలో మార్పులు చేపడుతున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

4. **గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**

5. **ప్రపంచ న్యూమోనియా నివారణా దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ళను మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లి నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన–పీఎంఎవై పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 3 లక్షలకు పైగా ఇళ్ళ గృహప్రవేశాల కార్యక్రమాన్ని దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికలో గృహాల లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ..

..వాయిస్... 30 సెకన్లు

-------------------------

మత్తుపదార్థాలు వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని హోంమంత్రి వి. అనిత తెలిపారు. అనకాపల్లిలోని పాయకరావుపేటలో మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన సైకిల్ ర్యాలీని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ, మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని మంత్రి సూచించారు.

---

ఉద్యోగాలకు తగిన నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకునేలా విద్యావ్యవస్థలో మార్పులు చేపడుతున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతిలోని ఒక ప్రవేట్ విద్యా సంస్థలో నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య దక్షిణ ప్రాంత ఉన్నత విద్య కాంక్లేవ్‌లో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

---

భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎమ్. శ్రీ భరత్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమాల్లో భాగంగా మేరా యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన యూనిటీ మార్చ్‌లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. స్వతంత్ర భారతదేశంలో 565 సంస్థానాలను విలీనం చేసిన ఘనత పటేల్‌కు దక్కుతుందన్నారు. గుజరాత్‌లోని నర్మద నది ఒడ్డున నిర్మించిన పటేల్ విగ్రహం దేశ ఐక్యతకు చిహ్నంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

---

యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన యువజనోత్సవ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల స్ఫూర్తితో యువత దేశానికి సేవలు అందించాలని ఆయన పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---

గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు మండలం దళాయివలస గ్రామం వద్ద పర్యాటకుల కోసం నూతనంగా అభివృద్ధి చేసిన ఆడపరాయి జలపాతంను మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యాటక శాఖతో సమన్వయంతో సాలూరు పరిసర ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

---

ఈరోజు ప్రపంచ న్యుమోనియా నివారణా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. వైరస్, బ్యాక్టీరియాలు ఊపిరితిత్తుల్లో చేరి శ్వాస వ్యవస్థను ప్రభావితం చేసే న్యుమోనియా వ్యాధిని ముందస్తు చికిత్స ద్వారా నివారించవచ్చని, టీకా కూడా అందుబాటులో ఉందని అవగాహన కల్పిస్తూ 2009వ సంవత్సరం నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతీ ఏటా నవంబర్ 12వ తేదీన ప్రపంచ న్యుమోనియా నివారణ దినంగా నిర్వహిస్తోంది. న్యుమోనియా నుంచి చిన్నారులను సంరక్షించేందుకు ఈ సంవత్సరం 'పిల్లల మనుగడ' ఇతివృత్తంతో న్యుమోనియా నివారణా దినాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

సంక్షేమంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. విజయవాడ గొల్లపూడిలోని శ్రీనివాసనగర కాలనీలో అంతర్గత సిమెంటు రహదారులు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు మురుగు నీటి సమస్య లేకుండా 79 లక్షల రూపాయలతో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే రహదారుల పనులు పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన ప్రాంతాల్లో రహదారులు, త్రాగునీరు, కమ్యూనికేషన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ తెలిపారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన గిరిజన స్వాభిమాన ఉత్సవాలలో జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామితో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గిరిజన యోధుల త్యాగాలను స్మరించుకునేందుకు గిరిజన స్వాభిమాన ఉత్సవాలు దోహదపడతాయని తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్యానంతరం భారతదేశాన్ని ఏకం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు పేర్కొన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమాలలో భాగంగా చిత్తూరులోని గాంధీ విగ్రహ కూడలి వద్ద నిర్వహించిన జిల్లా స్థాయి జాతీయ ఐక్యతా ర్యాలీని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ, యుద్ధంతో కాకుండా చర్చల ద్వారా కాశ్మీర్, హైదరాబాద్ లలో కొనసాగిన రాచరిక సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయడంలో వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారన్నారు. దేశ ఐక్యతలో పటేల్ పాత్రను స్మరించుకోవడానికి, జాతీయ ఐక్యత, సమైక్యతను చాటిచెప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో పలు చోట్ల పొడి వాతావరణం కొనసాగుతుందని, అలాగే కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా విజయవాడ- దువ్వాడ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ పోర్టు- విశాఖపట్నం, విశాఖ- కాకినాడ పోర్టు , రాజమహేంద్రవరం- విశాఖ, విశాఖ -రాజమహేంద్రవరం మధ్య నడిచే నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 20న రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అదే విధంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేపు నర్సాపూర్- సికింద్రాబాద్, ఈ నెల 15న అనకాపల్లి-సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

=====================